సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
బుధవారం । 15 । మార్చి । 2023



విద్యార్థీ... విజయీభవ
ఇంటర్మీడియెట్ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. -8లో..



కారును ఢీకొన్న లారీ
కారును లారీ ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ఆరుగురు గాయపడ్డారు. -8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.6/19.0
జిల్లాలో మంగళవారం 19.0 - 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

యువతకు మేలుకొలువు..
భవితకు మేలిమలుపు

- వ్యవసాయంతో విజేతగా నిలిచిన శ్రీనాథ్‌రెడ్డి
- 'ఫ్యాషన్' నుంచి ప్యాషన్ వైపునకు నడక
- కొలువు వీడి.. కాడి పట్టిన డిజైనర్
- ప్రకృతి సేద్యంలో ఆదర్శరైతు
- ఐదంచెల సాగుతో రూ.లక్షల్లో ఆదాయం
- అవార్డుల పంట పండిస్తున్న యువకుడు

✍ షేక్ ముజుబుద్దీన్, సాక్షి, కడప డెస్క్

SAKSHI SPECIAL

'తాత ముత్తాతల కాలం నుంచి మేము వ్యవసాయం చేస్తూనే ఉన్నాం. అయినా మూడు పూటలా ఐదు వేళ్లు నోట్లోకి వెళ్లాలంటేనే కష్టంగా ఉంది. నువ్వయినా మంచి ఉద్యోగం చేసుకుని బాగుపడతావనుకున్నాను. పంటలు పండిస్తానంటూ వెనక్కొచ్చావ్. మావల్ల కానిది నువ్వేం సాధిస్తావ్' అంటూ తండ్రి ధర్మారెడ్డి అడుగుతుంటే... 'ఏం చేయగలనో చూ(పి)ద్దామనే వచ్చాను నాన్నా' అని చెప్పాడు మోపూరి శ్రీనాథ్‌రెడ్డి. తండ్రొకడే కాదు అయినవారు, తెలిసినవారు కూడా స్వానుభవంతో హెచ్చరించారు .. అయినా ఆ యువకుడు వెనుకకు తగ్గలేదు. చదువుకు, ఉద్యోగానికి.. కొలువుకు, జీవితానికి సంబంధం లేదని నిరూపించాలనుకున్నాడు. పట్టుదలతో శ్రమించాడు. ప్రకృతి సేద్యంతో పొలంలో ప్రయోగాలు చేశాడు. అందరూ వద్దన్నచోటే విజేతయ్యాడు.. కాదన్నవారి మనసులు గెలిచాడు. రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. యువతకు మేలు'కొలువు' ఇదేనంటూ చెబుతున్నాడు. భవితకు మేలిమలుపును చూపిస్తున్నాడు. అందరితోనూ శెభాష్ అనిపించుకుంటున్నాడు.

జీవితానికి కొత్త డిజైన్

అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని బి.రాచపల్లికి చెందిన శ్రీనాథ్‌రెడ్డి గ్రాఫిక్ డిజైనింగ్ కోర్సు చేశాడు. ఎంబీఏ పూర్తి చేశాడు. ముంబైలో మంచి కంపెనీలో ఉద్యోగం సాధించాడు. అక్కడి వాతావరణం నచ్చక చెన్నైకు మారాడు. అక్కడ కూడా సరిపడక.. కొన్నాళ్లకు బెంగళూరులో మరో కంపెనీకి మారాడు. ఐదంకెల జీతం వచ్చేది. భార్య మాధవి కూడా అసిస్టెంట్ డిజైనర్‌గా పనిచేసేది. నాలుగు చేతులా ఆదాయం. సౌకర్యవంతమైన జీవితం. కానీ ఏదో లోటు కని పించేది. పీల్చే గాలి, తినే ఆహారం.. కలుషితంగానే అనిపించేది. ఠంఛనుగా ఆఫీసుకు వెళ్లడం, చీకటిపడ్డాక తిరిగి రావడం రొటీన్‌గా మారిపోయింది... నీటి గలగలలు, పక్షుల కిలకిలలు.. నేలతల్లి నడకలు లేకుండాపోయాయి. ఈ నేపథ్యంలో ఆరేళ్ల క్రితం సొంతూరికి వచ్చిన శ్రీనాథ్‌రెడ్డికి ప్రకృతి వ్యవసాయంపై పద్మశ్రీ సుభాష్ పాలేకర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిసింది.

గుంటూరు జిల్లా కాజ వద్ద నిర్వహించిన ఆ సదస్సుకు వెళ్లమని వ్యవసాయాధికారులు ప్రోత్సహించారు. అక్కడ పాలేకర్ పాఠాలన్నీ విన్నాడు. ఒడిదుడుకుల సాగు, రసాయనాల విధ్వంసం, నేల తల్లికి జరుగుతున్న నష్టం గురించి తెలుసుకున్నాడు. జీవితంలో తనేం కోల్పోతున్నాడో, భవిష్యత్‌లో తన బిడ్డలు ఎలాంటి 'విష'మ పరిస్థితులను ఎదుర్కోనున్నారో అవగాహన చేసుకున్నాడు. తన అసంతృప్తికి కారణమేంటో కనుగొన్నాడు. ఇప్పటివరకు తాము తింటున్నది విషమని గుర్తించాడు. భార్య మాధవి తోడుగా కాడి పట్టి పొలం వైపు కదిలాడు. తన తండ్రి, తోటి రైతులు, అధికారుల సహకారం తీసుకున్నాడు. బాలారిష్టాలు అధిగమించాడు. అహర్నిశలూ కృషి చేస్తూ వచ్చాడు. సాధారణ వ్యవసాయంలో వస్తున్న ఆదాయం కంటే రెట్టింపు సాధించాడు.. తమ 6 ఎకరాల పొలాన్ని 13 ఎకరాలకు విస్తరించాడు. ఐదంచెల సాగుతో సమగ్ర జీవ వైవిధ్య తోటను సృష్టించాడు. 7 ఎకరాల్లో మామిడి సాగుచేస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నాడు. కుటుంబ సభ్యుల సహకారంతో శ్రీనాథెడ్డి నిర్దిష్ట పంటల ప్రణాళికను అమలు చేస్తున్నాడు. దిగుబడిలో అద్భుత ఫలితాలు అందుకుంటున్నాడు. ఆరేళ్ల వ్యవధిలో పంటల సాగులో పట్టు సాధించాడు. ప్రస్తుతం ఏడాదికి ఖర్చులన్నీ పోనూ దాదాపు రూ.9 లక్షల నికర రాబడి అందుకుంటున్నాడు.


తాము పండించిన ఉత్పత్తులతో శ్రీనాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

▶▶ శిక్షణ సైతం..

ఒకప్పుడు ఫ్యాషన్ డిజైనర్‌గా కొందరికే తెలిసిన శ్రీనాథ్‌రెడ్డి, ఈరోజు ప్రకృతి వ్యవసాయంతో లాభాల పంట పండిస్తున్న రైతుగా ఎంతో ఖ్యాతి సాధించాడు. తోటి రైతులకు అనుభవ పాఠాలు బోధిస్తున్న ఈయన వ్యవసాయంపై వందలాది మందికి శిక్షణ ఇచ్చాడు. ఆసక్తి గలవారు 9880937907 నంబరులో సంప్రదించాలన్నారు.

▶▶ ఏడాది పొడవునా సాగు



ఏడాదంతా పచ్చదనం, ఆదాయం కోసం శ్రీనాథ్‌రెడ్డి రుతు పవన ముందరి సాగు - ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానాన్ని కచ్చితంగా పాటిస్తున్నాడు. తొలుత శ్రీనాథ్‌రెడ్డి అందరిలాగే వరి, కంది, జొన్న, సజ్జ పంటలు వేసి మంచి ఆదాయం సాధించాడు. ఈ క్రమంలో అందరూ ఏటా ఒకటో రెండో పంటలు పండిస్తూ మిగతా కాలమంతా నేలను ఖాళీగా వదిలేస్తున్నట్లు గమనించాడు. దానివల్ల భూమాతకు నష్టం.. ఆ తరువాత అన్నదాతకూ కష్టం అని గుర్తించాడు. ఖాళీగా ఉన్న మనిషి బుర్ర దెయ్యాలగుహలా మారినట్లు, నేల ఖాళీగా ఉన్నా సారం కోల్పోతుందని భావించాడు. దీంతో ఖరీఫ్ అయ్యాక మళ్లీ పంటలకు సిద్ధమయ్యాడు. ప్రకృతి వ్యవసాయ పాఠాలు మననం చేసుకుని ముందుకు సాగాడు. పొలం పోషకాలు కోల్పోకుండా ఉండేందుకు నవధాన్య పద్ధతులు పాటించాడు. నిత్యం పొలం పచ్చగా ఉండేలా మామిడిలో అంతర పంటలుగా చిరు ధాన్యాలు వేశాడు. అందులో 2ఎకరాలు పక్షుల కోసం కోయకుండా వదిలేశాడు. రైతులకు అనుకూలం అని చెప్పడానికి ఒక ఎకరాలో చేపల పెంపకం చేపట్టాడు, పలుపంటల పద్ధతిలో వేరుశనగ , దేశీ వంగడాలు, జొన్న, మొక్క జొన్న, వేరుశనగ, కంది, ఆముదం, గోంగూర, గోరు చిక్కుడు, బీర, కాకర, ఆనప, పుచ్చకాయలు, బంతి వంటి రకాలను సాగు చేశాడు. పంట చేతికొచ్చేంత వరకు ప్రకృతి వ్యవసాయం పాఠాలన్నీ పాటించాడు. ఫలితంగా పచ్చని లాభాలు పొందాడు.

▶▶ అవార్డుల పంట



శ్రీనాథ్‌రెడ్డి సేవలను ప్రకృతి సేద్య నిపుణులు సుభాష్ పాలేకర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు విజయ్ కుమార్ లాంటి ఎందరో ఉన్నత అధికారులు అభినందించారు. అనేక అవార్డులు, రివార్డులు పొందాడు.

- ఈ నెల 8వ తేదీన ఐకార్ నుంచి ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డునందుకున్నాడు.
- గత ఏడాది ఏపీ జీవ వైవిధ్య సంస్థ నుంచి ఉత్తమ రైతు పురస్కారం పొందాడు.
- 2021లో కిసాన్ ప్రగతి సంస్థ నుంచి ఆదర్శ రైతు అవార్డు సాధించాడు.
- 2020లో తెలంగాణ ప్రభుత్వంతో యువ రైతు పురస్కారం పొందాడు.
- ఇవే కాకుండా పదుల సంఖ్యలో వివిధ సంస్థలతో అవార్డులు అందుకున్నాడు.

▶▶ ప్రకృతి నడుమ పచ్చని కుటుంబం

ఉద్యోగానికి రాజీనామా చేసి శ్రీనాథ్‌రెడ్డి వ్యవసాయం చేస్తానన్నపుడు ఎంతోమంది కాదన్నా, ఆయన భార్య మాధవి మాత్రం పూర్తి మద్దతునిచ్చింది. తను కూడా ఉద్యోగాన్ని వదిలి వెంట నడిచింది. ఇద్దరూ కలిసి వ్యవసాయ క్షేత్రంలోనే ఆవాసం ఏర్పాటు చేసుకున్నారు. ఇంట్లో సేంద్రియ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. సిరిధాన్యాల వంటలు కూడా అలవాటు చేసుకుంటున్నారు. వీరి ఇద్దరు అబ్బాయిలు కూడా అక్కడే ఉంటారు. రోజూ స్కూల్‌బస్సులో 20 కి.మీ.ల దూరంలోని రాయచోటికి వెళ్లి వస్తుంటారు. ప్రకృతి నడుమ గడపడం.. పర్యావరణ, ఆరోగ్య స్పృహ అలవడటం వల్ల వీరు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారంటారు శ్రీనాథ్‌రెడ్డి దంపతులు. ఆరోగ్యకరమైన జీవనవిధానంతో మానసికంగా కూడా దృఢంగా తయారవుతారంటారు. బి.రాచపల్లెలో ఇల్లున్నా అత్యవసరమైతే తప్ప అక్కడికి వెళ్లరు. శ్రీనాథ్‌రెడ్డి తల్లిదండ్రులు రోజూ వీళ్ల దగ్గరికి వస్తూపోతూ చేదోడువాదోడుగా ఉంటారు. వీళ్ల వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించేందుకు రోజూ చాలామంది వస్తుంటారు.


వ్యవసాయ క్షేత్రంలో శ్రీనాథ్‌రెడ్డి, మాధవి

▶▶ ఇంటి వద్దే విక్రయాలు

రసాయన రహితపంటలకు మార్కెటింగ్ సమస్య ఉండదని నిరూపించాడు శ్రీనాథ్‌రెడ్డి. ఈయన ఇంటివద్దే తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, బియ్యం, పప్పుదినుసుల కోసం నిత్యం ఎక్కడెక్కడివారో వీరింటికి వచ్చిపోతుంటాడు. ఇక్కడి పంటలు నాణ్యంగా, రుచికరంగా ఉన్నాయని కొనుగోలుదారులు చెబుతుంటారు.

'లక్షలొస్తున్న మంచి ఉద్యోగం చేసుకోక వీడికెందుకీ కష్టం అని చాలా బాధపడ్డాను. వ్యవసాయం రంగంలో పడి ఏమైపోతావో అని అనుకున్నాను. నా దిగులు తీర్చేశావు. నలుగురూ మెచ్చేలా నిలబడ్డావురా..' అంటూ ఇపుడు తండ్రి అభినందిస్తుంటే.. 'సాధించింది గోరంతే నాన్నా, మీ సహకారంతో ప్రకృతి సేద్యంలో మొలకై పుట్టి చెట్టయ్యాను. ప్రపంచానికి పచ్చని విస్తరి వేసి ప్రకృతి ప్రసాదం వడ్డించే స్థాయికి విస్తరించాలని ఆశీర్వదించండి' అని శ్రీనాథ్‌రెడ్డి మనసారా కోరుకుంటున్నాడు.

న్యూస్‌రీల్

తాత్కాలికంగా డెమో రైలు రద్దు



కడప కోటిరెడ్డిసర్కిల్ : నంద్యాల-కడప-నంద్యాల మధ్య నడుస్తున్న నంద్యాల డెమో (07284/85) రైలును ఈనెల 14, 15, 16 తేదీలలో తాత్కాలికంగా రద్దు చేశారని కడప రైల్వే స్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి, కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా తెలిపారు. ఈ రైలు నిర్వహణతోపాటు వసతులను ఆధునీకరించేందుకు ఈ మూడురోజులు డెమో రైలును రద్దు చేశారన్నారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని వారు సూచించారు.

జేఎన్‌టీయూ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్ : పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో సోమవారం ఫిబ్రవరి-2023లో నిర్వహించిన బీటెక్ రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ (ఆర్20) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ వసుంధర తెలిపారు. ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ వసుంధర, వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి, పరీక్షా కేంద్ర విభాగాల అధిపతులు, వివిధ డిపార్ట్‌మెంట్ల విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

కేంద్ర పొగాకు పరిశోధన సంస్థతో వైవీయూ ఒప్పందం



వైవీయూ: పరిశోధనలకు ఊతమిచ్చేలా రాజమండ్రి కేంద్ర పొగాకు పరిశోధన సంస్థతో యోగివేమన విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం వైవీయూ ఇంకుబేషన్ సెంటర్ సంచాలకులు ఆచార్య ఎ.చంద్రశేఖర్, పరిశోధన అభివృద్ధి (ఆర్అండ్‌డి) సంచాలకులు ఆచార్య పులి చంద్రఓబులరెడ్డిల ఆధ్వర్యంలో కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ సంచాలకులు డా.మాగంటి శేషుమాధవ్, పరిశోధకులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సరళ, డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ కస్తూరి కలిసి అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

వైవీయూలో నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని వైవీయూ పీజీ కళాశాల, ప్రొద్దుటూరు వైవీయూ వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 2022-23 విద్యాసంవత్సరానికి పీహెచ్‌డీలో ప్రవేశానికి ఈనెల 17వ తేదీన ప్రవేశాల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఆర్‌సెట్)-22 అర్హత సాధించినవారు ప్రవేశాలకు అర్హులన్నారు. వైవీయూ పరిధిలోని 25 డిపార్టుమెంట్లలో 107 పీహెచ్‌డీ సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇందులో 77 ఫుల్‌టైం, 17 పార్ట్‌టైం, అఫిలియేటెడ్ రీసెర్చ్ సెంటర్‌లలో 13 సీట్లు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఏపీ ఆర్ సెట్-22 ర్యాంకు కార్డు, మార్క్సుమెమో, ప్రొవిజనల్ పాస్ సర్టిఫికెట్, డిగ్రీ ప్రొవిజనల్/ఓడీ సర్టిఫికెట్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ (అర్హత ఉన్నవారు), టీసీ, స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రము, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. అదే విధంగా యూజీసీ నెట్, సెట్, ఇంజనీరింగ్ విద్యార్థులు గేట్ వంటి అర్హతల, కుల ధృవీకరణ పత్రాలతో వైవీయూలో 17వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

17న పీహెచ్‌డీ స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఏపీ రీసెట్ కౌన్సెలింగ్‌లో మిగిలిన పీహెచ్‌డీ సీట్లను ఈ నెల 17న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డి తెలిపారు. ఏపీ రీసెట్-2022లో అర్హత సాధించి, సంబంధిత పీజీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు వర్సిటీ పాలకభవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలు జేఎన్‌టీయూ.ఎసి.ఇన్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి: కలెక్టర్


రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ఎడ్యుకేషనల్ ఏపీ ఫని- 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రస్థాయిలో 7, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన మెరిట్ స్కాలర్ షిప్ టెస్టులో ప్రతిభచాటిన విద్యార్థులను మంగళవారం కలెక్టర్ విజయరామరాజు తన కార్యాలయంలో అభినందించారు. పదవ తరగతికి సంబంధించి పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి సీవీ సాయి జశ్వంత్ రూ. 30 వేల నగదును గెలిచి రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచాడు. 7వ తరగతికి సంబంధించి మైదుకూరు మండలం శెట్టివారిపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన వీర ఉదయశ్రీ రూ. 20 వేల నగదు గెలిచి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాస్థాయిలో 10వ తరగతిలో మొదటి స్థానాన్ని సాధించిన హఫీజూన్, రెండవ స్థానంలో నిలిచిన గౌతమ్‌రెడ్డి, మూడవ స్థానంలో నిలిచిన సుప్రియలను, 7వ తరగతిలో జిల్లా మొదటిస్థానాన్ని సాధించిన లలిత, రెండవ స్థానాన్ని సాధించిన సౌమ్యారెడ్డిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డిలు పాల్గొన్నారు.

మార్కుల మాయాజాలం

కొంత మంది అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందడానికి బరి తెగిస్తున్నారు. వారికి కొందరు సహకరిస్తున్నారు. దీంతో అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరుగుతోంది. ఇటీవల జరిగిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల్లో పలువురు బోగస్ మార్కుల జాబితాతో మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందారు. తాజాగా బోగస్ మార్కుల జాబితాల కుంభకోణం వెలుగుచూడటంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో అలజడి నెలకొంది.

- బోగస్ జాబితాతో అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందిన వైనం
- అనుమానంతో తీగలాగితే కదిలిన డొంక
- ఇప్పటి వరకు 8 మందివి నకిలీ సర్టిఫికెట్లుగా నిర్ధారణ
- స్టాఫ్ నర్సుల నియామకాల్లో వెలుగు చూసిన అక్రమాలు
- వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో కలకలం


వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకానికి సంబంధించి ప్రభుత్వం 2022 నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధి (జోన్-4)లో దాదాపు 12000 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాయలసీమ వ్యాప్తంగా అభ్యర్థులు ఉన్నారు. 2023 జనవరిలో స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియను కడపలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. మొత్తం 291 మందికి మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ ఉద్యోగాలు పొందడానికి ఇంటర్మీడియెట్ తర్వాత నాలుగేళ్లు స్టాఫ్ నర్సు కోర్సు చేయాలి లేదా బీఎస్సీ నర్సింగ్ కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సుకు గుర్తింపు ఉంటుంది. అంటే ఈ యూనివర్సిటీ వారు జారీ చేసిన మార్కుల జాబితాతోపాటు ఇతర సర్టిఫికెట్లకు గుర్తింపు ఉంటుంది. కాగా, స్టాఫ్ నర్సు నియామకాల్లో మార్కుల జాబితానే కీలకపాత్ర పోషిస్తుంది. ఎవరికైతే అత్యధికంగా మార్కులు ఉంటాయో వారినే ఉద్యోగం వరిస్తుంది. ఈ అంశాన్ని గమనించిన కొంత మంది ఏకంగా మార్కుల బోగస్ జాబితాను సృష్టించి ఉద్యోగాలు పొందారు.

అనుమానంతో తీగ లాగడంతో...

ఈ వ్యవహారమంతా దాదాపు చిత్తూరు జిల్లా కేంద్రంగా జరగడం చర్చనీయాంశంగా మారింది. ఆ జిల్లాకు చెందిన రిటైర్డ్ పోలీసు అధికారి కుమార్తెకు స్టాఫ్ నర్సు ఉద్యోగం రాలేదు. తన కుమార్తెకు మార్కుల పరంగా మెరిట్‌లో ఉన్నప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో అనుమానించారు. దాదాపు 15 మందిపై దృష్టి సారించారు. వారిపై కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్‌తోపాటు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి ఫిర్యాదు చేశారు. అందులో కొన్ని బోగస్ మార్కుల జాబితాలు ఉన్నట్లుగా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్ధారించారు. దీంతో అనుమానం నిజమైంది. కాగా వారికి ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చేముందు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ కౌన్సెలింగ్‌లో కూడా ఆ శాఖ అధికారులు నకిలీ మార్కుల జాబితాలను కనిపెట్టలేకపోయారు. తాజాగా ఈ అంశం ఆ శాఖలో కలకలం రేపుతోంది. ఈ 15 మందేనా? లేక ఇంకా ఎవరైనా ఉద్యోగాలు పొందిన బోగస్ అభ్యర్థులు ఉన్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వారు వీరేనా?

చిత్తూరు జిల్లాలో కోవిడ్ సమయంలో విరివిగా స్టాఫ్ నర్సుల నియామకాలను చేపట్టారు. ఈ సందర్భంగా కొంత మంది వైద్య ఆరోగ్యశాఖకు చెందిన అధికారులు అభ్యర్థులకు తక్కువ మార్కులు ఉన్నా ఎక్కువ ఉన్నట్లుగా సృష్టించి కాంట్రాక్టు నర్సులుగా ఉద్యోగ నియామకాలు చేపట్టారు. అప్పట్లో ఈ అంశం వైద్య ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. అలా నాడు బోగస్ మార్కుల జాబితాను పొందిన వారిలో కొంత మంది తాజాగా వెలుగు చూసిన స్టాఫ్ నర్సు నియామకాల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లు వినికిడి. కాగా, తాజాగా అలజడి రేపుతున్న బోగస్ మార్కుల జాబితా అంశం ఇంటి దొంగల పనా? లేక బయటి వ్యక్తుల పనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లోతుగా విచారణ చేస్తే మరి కొత మంది బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారు బయటపడతారని ఆ శాఖకు చెందిన ఉద్యోగులు భావిస్తున్నారు. ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ నియామకాలు చేపడుతోంది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న కొంత మంది ఎవరికీ అనుమానం రాకుండా అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ఆ శాఖపై ఉంది. అలాగే అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉందని నిరుద్యోగులు అంటున్నారు.

చట్టపరమైన చర్యలు

15 మంది అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాలు పొందినట్లుగా తమ దృష్టికి వచ్చింది. ఆ వివరాలను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి, డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ వారికి పంపాము. 15 మందిలో 8 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బోగస్‌వని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు స్పష్టం చేశారు. ఆ ఎనిమిది మందిలో ఐదుగురు వైద్య విధాన పరిషత్‌లో, ఇద్దరు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక అభ్యర్థికి ఉద్యోగం రాలేదు. మిగతా వారి సర్టిఫికెట్ల వివరాలు అందాల్సి ఉంది. కాగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేశాం. ఇంకా ఎవరైనా బోగస్ మార్కుల జాబితాను పొందిన వారు ఉన్నారేమోనని ఆరా తీస్తున్నాం. అక్రమాలకు పాల్పడే వారు ఎవరైనా సరే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. - డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం, కడప

విద్యార్థిపై పిచ్చికుక్క దాడి


ధనుష్‌ను పరామర్శిస్తున్న కమిషనర్

రాజంపేట టౌన్ : అన్నమయ్య జిల్లా రాజంపేటలోని నలంద స్కూల్ సమీపంలో మంగళవారం ఓ పిచ్చి కుక్క ధనుష్ అనే విద్యార్థిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధనుష్ మధ్యాహ్నం పాఠశాల నుంచి భోజనం తినేందుకు ఇంటికి వెళ్ళే సమయంలో కుక్క వెంబడించింది. విద్యార్థి కింద పడిపోవడంతో ఇష్టానుసారంగా కరవడం ప్రారంభించింది. సమీపంలో ఉన్న ఓ మహిళతో పాటు భవన నిర్మాణ కార్మికులు స్పందించి కుక్కను కట్టెతో అక్కడి నుంచి తరిమేశారు. అనంతరం బైక్‌లో ఆ బాలుడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల, చెవి వద్ద బలమైన గాయాలు కావడంతో అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు తిరుపతికి తరలించి అక్కడి హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. గాయపడ్డ విద్యార్థి తల్లిదండ్రులు జీవనోపాధి నిమిత్తం కువైట్‌లో ఉన్నారు. ధనుష్ తన అత్త వద్ద ఉంటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. కొద్ది రోజులుగా ఆ ప్రాంతంలో అదే కుక్క ఒకరిని కరిచిందని, అలాగే పలువురిని కరిచేందుకు వెంటబడుతూ ఉందని స్థానికులు తెలిపారు.మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మునిసిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు తెలుసుకున్నారు. తిరుపతి లోని కార్పొరేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ధనుష్‌ను ఆయన పరామర్శించారు. కాగా, మున్సిపాలిటీలో కుక్కల పట్టివేతకు బుధవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కమిషనర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. బాలుడిపై దాడిచేసిన పిచ్చికుక్కను పట్టుకొని అడవుల్లోకి తరలించినట్లు తెలిపారు.

తిరుపతి వెంకన్న సాక్షిగా
ఎవిస్ హాస్పిటల్స్ వైద్య సేవల విస్తరణ
వాస్కులర్ వైద్యంలో దక్షిణ భారతదేశంలో అగ్రగామి ఎవిస్ హాస్పిటల్స్ (హైదరాబాద్)
కాళ్లలో సిరలఉబ్బు వ్యాధి (వెరికోస్ వెయిన్స్) బాధితుల కోసం
డాక్టర్ పి. విజయ్ కుమార్
కరోనా భయం లేని విధంగా వైద్య సేవలు అందించెదరు.
డాక్టర్ పి. విజయ్ కుమార్ MBBS, DNB, FMAS, DMAS, FAVS. Varicose veins specialist & Minimal Invasive Surgeon
తేది: 16-03-2023 గురువారం, తిరుపతిలో ఉ.10.00 గం.ల నుండి సా. 4 గం. ల వరకు దిగువ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటారు.
అంకుర హాస్పిటల్
నెం. 19-3-14/యస్, వార్డు నెం. 19, బ్లాక్ నెం.3, ఏ & టి. కాలనీ, రేణిగుంట రోడ్డు, తిరుపతి.
అపాయింట్‌మెంట్ కోసం 9989527715

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


కిశోర్ (ఫైల్)

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో నివాసం ఉండే వెంకటస్వామి కుమారుడు మల్లె బోయిన కిశోర్ (40) అదృశ్యమైనట్లు అతని భార్య ఉమ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటక్రిష్ణయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 8న ఇంటిలో గొడవ పడి వెళ్లి పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్లు 6305559746, 9121100530కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

కడపలో విద్యార్థిని..

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శారదా విద్యానిలయం సమీపంలో నివసిస్తున్న షేక్ అర్షియా(17) తన ఇంటి నుంచి సోమవారం మదరసాకు వెళ్లి తిరిగిరాలేదు. ఈక్రమంలో విద్యార్థిని తల్లి షేక్ షాహినా పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ సంజీవరాయుడు తెలియజేశారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం


వృద్ధురాలిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

వైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం జలాశయంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధురాలిని పోలీసులు కాపాడారు. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం వేపరాలకు చెందిన వెంకటసుబ్బమ్మ (74)కు భర్త, పిల్లలు లేకపోవడంతో కొంత కాలం నుంచి తమ్ముడి వద్ద ఉండేది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది తనువు చాలించాలని భావించింది. మంగళవారం మైలవరం జలాశయం గేట్ల వద్ద తిరుగుతుండగా.. గమనించిన జలాశయం సిబ్బంది పోలీస్ అధికారులకు తెలియజేశారు. వెంటనే హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, బీట్ కానిస్టేబుల్స్ రామాంజనేయులు, వెంకటసుబ్బయ్య, మహిళ పోలీసు సునీత అక్కడికి చేరుకున్నారు. వృద్ధురాలిని స్టేషన్‌కు తీసుకొచ్చి మనోస్థైర్యం కల్పించి బంధువులకు అప్పగించారు. దీంతో పోలీస్ సిబ్బందిని పలువురు అభినందించారు.

విద్యార్థీ.. విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- సర్వం సిద్ధం చేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం పరీక్షా కేంద్రాలు	:92
ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు	:18,377
ద్వితీయ సంవత్సర విద్యార్థులు	:24,696
సమస్యాత్మక కేంద్రాలు	:11
సెల్ఫ్ సెంటర్లు	:13
ఛీఫ్‌లు, డిపార్టుమెంట్ అధికారులు	:184
ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు	:4
సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు	:10
సెంటర్ కస్టోడియన్లు	:10
పరీక్షల కమిటీ సభ్యులు	:5


ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో నంబరింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఐవో రమణరాజు

కడప ఎడ్యుకేషన్ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15న (బుధవారం) నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 వరకు జరగనున్నాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. 9 గంటలు దాటిన తరువాత ఒక్కరిని కూడా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఏడాది పరీక్ష విధులకు హాజరయ్యే సిబ్బంది ఎవరూ కూడా కేంద్రాలలోకి హ్యాండ్‌సైడ్ సెల్‌ఫోన్స్ తీసుకరాకూడదని ఆదేశించారు. ఒక చీఫ్ సూపరిండెంటెంట్‌కు మాత్రం సమాచారం తెలిపేందుకు బటన్ ఫోన్స్‌ను అనుమతించారు. అది కూడా సమాచారం పంపగానే పరీక్షా కేంద్రం ఆఫీసు రూములో పెట్టాల్సి ఉంటుంది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 23 ప్రభుత్వ కళాశాలలు, 4 ఎయిడెడ్ కళాశాలలు, 5 గురుకుల పాఠశాలలు, 2 మోడల్ స్కూల్స్, 57 ప్రైవేటు జూనియర్ కళాశాలలో పాటు ఒక హైస్కూల్ ప్లేస్‌ను సిద్ధం చేశారు. ఈ పరీక్షా కేంద్రాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 18,377 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 24,696 ఇలా మొత్తం 43,073 మంది రాయనున్నారు. సంబంధిత పరీక్షలను 92 చీఫ్ సూపరింటెండెంట్లు, 92 మంది డిపార్టుమెంట్ అధికారులతోపాటు 4 ఫ్లైయింగ్ స్క్వాడ్, 10 సిట్టింగ్ స్క్వాడ్, 10 మంది సెంటర్ కస్టోడియన్‌లు పర్యవేక్షించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు నిర్వహించనున్నారు.

నిఘా నీడలో...

ఉమ్మడి జిల్లాలోని 92 పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ఆర్‌ఐవో కార్యాలయంలోపాటు విజయవాడలోని ఇంటర్‌బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేశారు. కడపలోని ఇంటర్ ఆర్‌ఐవో కార్యాలయంతోపాటు ఇంటర్‌బోర్డు కార్యాలయం నుంచి కూడా పరీక్షల నిర్వహణను పర్యవేక్షించవచ్చు.

11 సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఇందులో గండిలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, తొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిమఠం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, కమలాపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, లింగాల ప్రభుత్వ జూనియర్ కళాశాల, నందలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెనగలూరు బాలికల జూనియర్ కళాశాల, ఎల్‌ఆర్‌పల్లె ఎస్వీ జూనియర్ కళాశాల, వీరబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు.

టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఏవైనా సమస్యలంటే ఫిర్యాదు చేసేందుకు కడప ఆర్‌ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే ఈ కంట్రోల్ రూములో ఏర్పాటు చేసిన 08562-244171 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ఎక్కడా నేల బారు పరీక్షలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను సిద్ధం చేశాం. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష విధులకు హాజరయ్యే సిబ్బంది ఎవరు కూడా కేంద్రాలలోకి సెల్‌ఫోన్స్ తెచ్చుకోకూడదు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి సెల్‌ఫోన్స్, యూట్యూబ్‌ల ద్వారా వచ్చే ఎలాంటి వదంతులను ఎవరూ నమ్మవద్దు.

– రమణరాజు, ఆర్‌ఐవో, ఇంటర్ విద్య

అయ్యో..పాపం

డ్రైనేజీ గుంతలో ఆడపిల్ల పసికందు మృతదేహం

పులివెందుల రూరల్ : అయ్యో.. పాపం.. పేగు తెంచుకుని పుట్టిన బిడ్డ అమ్మకే భారమైందా? విధి రాతకు ఎదురీదలేని ఆ తల్లి ఇలా వదిలించుకుందా? అత్తింటి పోరా? ఆర్థిక సమస్యలా? లేక చేసిన తప్పునకు ప్రతిఫలమా? కారణమేంటో తెలియదు. కానీ పులివెందుల పట్టణం క్రిష్టియన్‌లైన్‌లోని డ్రైనేజీ గుంతలో మంగళవారం ఆడపిల్ల పసికందు మృతదేహం లభ్యమైంది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు చలించిపోయి మున్సిపల్ సిబ్బందికి తెలియజేశారు. దీంతో పారిశుధ్య సిబ్బంది అక్కడికి చేరుకుని డ్రైనేజీ గుంతలో ఉన్న పసికందును బయటకు తీశారు. మూగ జీవాలు సైతం బిడ్డలు జన్మించినప్పుడు ఆప్యాయంగా బాగోగులు చూసుకుంటుంటే.. నోరున్న మనుషులు ఈ విధంగా చేయడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆడపిల్ల జన్మించి ఉందని పడవేసి పోయి ఉండవచ్చునని అర్థమవుతోంది. భ్రూణ హత్యలు చేయడం నేరమని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా. వారి మాటలను కొందరు పెడచెవిన పెడుతున్నారు. ఒకవేళ గర్భంలోనే బిడ్డ చనిపోయి పుట్టినా.. సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించాలని స్థానికులు అంటున్నారు. కానీ ఇలా పడేయడం అమానవీయమని పేర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఇలాంటి వారిపై సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సర్వీసు పెంపుపై హర్షం

గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు ప్రభుత్వం పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఇందుకు సంబంధించిన గెజిట్‌ను నవంబర్‌లో జారీ చేశారు. దీనిని రాష్ట్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదించింది. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టనున్నారు. దీంతో గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – కడప కల్చరల్

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



సర్వీసు విషయంగా మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకముండేది. మా విజ్ఞప్తి మేరకు ఆయన మా సర్వీసును 62 ఏళ్లకు పెంచడం పట్ల రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పెంపుతో ఉద్యోగుల జీవితాల్లో ఎన్నో మంచి మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. – నాదెండ్ల బాబ్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం

రుణపడి ఉంటాం



నేను ఇటీవలే రిటైర్డ్ అయ్యాను. ప్రస్తుతం సర్వీసు పెంచడంతో మళ్లీ ఉద్యోగంలో చేరుతాను. జీవితంలో చక్కబెట్టాల్సిన కార్యక్రమాల పట్ల జాగ్రత్త వహించే అవకాశం లభించింది. సర్వీసు పెంచడానికి కారణమైన ముఖ్యమంత్రికి, సంబంధిత మంత్రి, రాష్ట్ర, జిల్లా చైర్మన్ తదితరులకు శాశ్వతంగా రుణపడి ఉంటాం. – శ్రీనివాసులు, రిటైర్డ్ ఉద్యోగి, జిల్లా గ్రంథాలయ సంస్థ, కడప

ఈ మేలు మరువలేం



జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల వినతిని మన్నించి సర్వీసు కాలాన్ని పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం. రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో ఉద్యోగులకు మేలు జరుగుతుంది. ఇందుకు కారకులైన వారందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాం. – సుబ్రమణ్యం, ఉద్యోగి, జిల్లా గ్రంథాలయ సంస్థ, కడప

కారును ఢీకొన్న లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- ఒకరి మృతి.. ఆరుగురికి గాయాలు
- వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు


మృతి చెందిన శ్యాంసన్

చెన్నూరు : వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం గిద్దలూరుకు వెళ్లి అక్కడి నుంచి మంగళవారం తెల్లవారుజామున కడప నగరం అశోక్‌నగర్‌కు బయలుదేరారు. మరో 10 నిమిషాలలో ఇంటికి చేరుకునే లోపు కడప బైపాస్ పాలెంపల్లె వద్ద ఉదయం 6.30 గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదం సంభవించింది. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఒకరు మృతి చెందగా, ఆరుగురికి గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప నగరం ఆశోక్‌నగర్‌కు చెందిన శ్యాంసన్ తన కుటుంబంతో వ్యక్తిగత పనులపై శనివారం గిద్దలూరు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి మంగళవారం తెల్లవారుజామున కడపకు బయలుదేరారు. అయితే కడప బైపాస్‌లోని పాలెంపల్లె వద్దకు రాగానే ఉదయం 6.30 గంటలకు రాజంపేట వైపు నుంచి ఆలంఖాన్‌పల్లె బైపాస్ మీదుగా వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న శ్యాంసన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అందులో ప్రయాణిస్తున్న శ్యాంసన్ భార్య శోభారాణి, వారికి చెందిన ఇద్దరు కూతుళ్లు, కొడుకుతోపాటు శోభారాణి ఆడబిడ్డ ఝాన్సీ ప్రసన్నకుమారి, ఆమె కుమారుడు గాయాల పాలయ్యారు. వారిని 108 అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ తగిలి రైతు మృతి


మృతి చెందిన గురుశేఖర్‌రెడ్డి

చాపాడు : మండలంలోని సీతారామాపురంలో మంగళవారం ట్రాక్టర్ ట్రాలీ తగిలి ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీతారామాపురానికి చెందిన రైతు ఉప్పలూరు ఓబుళరెడ్డి రెండెకరాలలో పసుపు పంట సాగు చేశాడు. ఈయన చిన్న కుమారుడైన రైతు గురుశేఖర్‌రెడ్డి (36), ఆయన భార్య ఓబుళమ్మ పసుపు పంట నూర్పిడి పనులు చేసుకుంటున్నారు. వీరు ట్రాక్టర్‌లో పసుపు పంటను తరలించే పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ నాగన్న రివర్స్ వస్తుండగా.. వెనకాల ఉన్న గురుశేఖర్‌రెడ్డిని ట్రాలీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గురుశేఖర్‌రెడ్డిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఆయనకు కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కేసీ రాజు తెలిపారు.

2012 నుంచి ప్రకృతి వ్యవసాయ ప్రతినిధిగా..

2012లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పురుగు మందులు లేని వ్యవసాయం(ఎన్‌పీఎం)లో గురుశేఖర్‌రెడ్డి చేరి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాడు. 2012లో దీనిని పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంగా మార్చగా.. గురుశేఖర్‌రెడ్డి ఐదు గ్రామాల యూనిట్‌కు ప్రతినిధిగా పని చేస్తున్నాడు. ఇప్పటికే సీతారామాపురం గ్రామంలో చాలా మంది రైతులను చైతన్య పరిచి, ఆ విధానంపై దృష్టి సారించేలా చేశారు. ప్రకృతి వ్యవసాయం అనగానే గుర్తొచ్చేలా గురుశేఖర్‌రెడ్డి సమీప గ్రామాల్లో పేరొందాడు. ఆయన మృతి పట్ల వ్యవసాయ అధికారులు, సిబ్బందితోపాటు ఆయా గ్రామాల ప్రజలు విచారం వ్యక్తం చేశారు.

5 ఎర్రచందనం దుంగల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, వాహనంతో అటవీ అధికారులు

పీలేరు : అక్రమంగా తరలిస్తున్న 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా వున్నాయి. ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె జమ్మికుంట వద్ద అటవీ సిబ్బంది నిఘా ఉంచారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అతివేగంగా వచ్చిన వాహనాన్ని సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆపకుండా ముందుకు పోవడంతో ఫారెస్ట్ సిబ్బంది వాహనాన్ని వెంబడించడంతో రోడ్డు పక్కన ఆపి చీకట్లో పరారయ్యారు. వాహనాన్ని పరిశీలించగా ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వాహనంతోపాటు 141 కేజీల బరువు గల 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది ప్రతాప్, కుప్పుస్వామి, ప్రభుతేజ, చరణ్ పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చవద్దు


గిరిజన సమాఖ్య రాష్ట్రమహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నేతలు

రాయచోటి అర్బన్ : ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చాలని పాలకులు ప్రయత్నిస్తుండటం దారుణమని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభల పోస్టర్లను నేతలు విడుదల చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్టీలలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన జీఓ నం.52ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఏపీ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఏప్రిల్ 25, 26 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. మహాసభలలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చిస్తామన్నారు. కావున గిరిజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథనాయక్, ఉపాధ్యక్షుడు అశోక్, లంబాడ సంఘం రాష్ట్రనేత శంకర్ నాయక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటి, గిరిజన సమాఖ్య నేతలు ఎల్లప్ప, రాజారాం నాయక్, దేవరాజ్, ఈనోజి, మనోహర్, రాజా నాయక్‌తో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల సైనిక్ స్కూల్‌కు విశ్వం విద్యార్థినులు


డి.దేవాన్షి


డి.వినతి చౌదరి


కె.మాన్విక‌రెడ్డి


ఎస్.వర్షిణి

తిరుపతి ఎడ్యుకేషన్ : బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యా సంస్థల విద్యార్థినులు నలుగురు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో డి.దేవాన్షి, డి.వినతి చౌదరి, కె.మాన్వికరెడ్డి, ఎస్.వర్షిణి ఉత్తమ ప్రతిభతో కిట్టూరు బాలికల సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందినట్లు ఆయన తెలియజేశారు. తమ విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. అనంతరం ఆయన విద్యార్థులను అభినందించారు.

నిప్పురవ్వలు పడి అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అట్లూరు : మండలంలోని నల్లాయపల్లె రెవెన్యూ పొలం సమీపంలో గల విద్యుత్ తీగలు రాసుకుని నిప్పురవ్వలు పడి అగ్నిప్రమాదం జరిగింది. మంగళవారం జరిగిన ఈ ఘటనలో గ్రామానికి చెందిన నాగిరెడ్డిముసల్‌రెడ్డి అనే రైతుకు చెందిన తోటలోని కొన్ని మామిడి చెట్లు, టెంకాయ చెట్లు, డ్రిప్ పైపులు కాలిపోయాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన ఇమాం ఖాసీం

రాజుపాలెం : మండలంలోని గోపాయపల్లె గ్రామానికి చెందిన షేక్ ఇమాంఖాసీం (24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రాజగోపాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తండ్రి షేక్ ఇమాం హుసేన్ ఇష్టం లేని పెళ్లి సంబంధం తెచ్చాడని వారి ఇరువురి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో సోమవారం ఇమాం ఖాసీం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతన్ని కడప ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంగళవారం కర్నూలుకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తల్లి అబీదా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వైద్యసంస్థలన్నీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, పాలిక్లినిక్‌లు, లాబొరేటరీస్, కంటి, దంత వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్‌లు, ఫిజియోథెరపీ తదితరాలను ఏపీ మెడికల్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టప్రకారం నమోదు చేసుకోవాలని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎన్.కొండయ్య తెలిపారు. మార్చి 31వ తేదీ లోపు వైద్యసంబంధిత సంస్థలన్నీ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. గడువులోపు తమ వివరాలను నమోదు చేయని సంస్థలపై చర్యలు తీసుకుంటామంటూ ఆయన హెచ్చరించారు.

జేఎన్టీయూలో సంప్రదాయ దినోత్సవం


సంప్రదాయ వస్త్రధారణలో జేఎన్టీయూ విద్యార్థులు, అధ్యాపకులు

కలికిరి: జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల దశాబ్ద వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో సంప్రదాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది దేశ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రాలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బతుకమ్మ కోలాటం, దాండియా నృత్యం, ఇతర సంప్రదాయ నృత్యాలు చేశారు. పలు పాటలు పాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ నేటి సమాజంలో మన సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో వాటిని భావి తరాలకు అందివ్వడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుభాష్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ అపర్ణ, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th,ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, B.Tech, BCA, MCA పాసయ్యే ఛాన్స్ కలదు. నాగేష్ అకాడమీ, కడప. 75694 70023 [G-6355]

FREE TRAINING

■ Praise The lord పేద అమ్మాయిలకు Hyd- కూకట్‌పల్లిలో ఫ్రీ-వసతి, HR మేనేజర్ + మీడియా ప్లానర్+డిజి॥ మా॥+ కంప్యూటర్ అకౌంట్స్ + ప్రొఫెషనల్ కోర్సుల 120డేస్ ట్రైనింగ్ తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్ ఆదాయం. డిగ్రీ + స్మార్ట్ ఫోన్ మస్ట్. Ph: 9182242932 [HA-2439]

REAL ESTATE

PLOT FOR SALE

■ Maruthinagar Near Kesavareddy School 11సెంట్లు స్థలం అమ్మబడును. సంప్ర: 8500236681 [H-796737]

LAND FOR SALE

■ Jammalamadugu, Sai Shivani Kalyana mandapam beside 2.34 Acer Land for Sale Contact: 9849546668 [HA-57739]

TO-LET

■ కడప టౌన్, Y.V. స్ట్రీట్ సమీపం ట్రంక్ రోడ్డులో కైలాస్ కాంప్లెక్స్ నందు ఆఫీసులకు, వ్యాపారాలకు, కోచింగ్ సెంటర్స్, టైలర్స్, బ్యూటీక్లినిక్, ఫ్యాన్సీ షాపు, డాక్టర్స్ అనువైన చిన్న పెద్ద రూములు గ్రౌండ్ ఫ్లోర్లో, 1st ఫ్లోర్ లో గలవు. 9440280825, 9177191847. [C-781460]

■ కడప నగరం, రామాంజనేయపురంలోని రాజంపేట మెయిన్ రోడ్డుకు సమీపంలో 3000 Sqt గల గోడౌన్ అన్నిరకాల సదుపాయాలు, భద్రతలతో బాడుగకు ఇవ్వబడును. సంప్ర: 8639033983, 9676887229. [C-781436]

HOUSE FOR SALE

■ మదనపల్లి పట్టణం స్థానిక సొసైటీ కాలనీ(NTR సర్కిల్‌కు అతిసమీపంలో) 64 ఫీట్x20ఫీట్, 142 స్క్వేర్ యార్డ్స్ విస్తీర్ణం కల్గిన(ఇంటిముందు 60అ. మెటల్ రోడ్ గల)ఇండిపెండెంట్ ఇల్లు అమ్మకమునకు కలదు. 9701363136, 8885360566. [T-2130]

SERVICES

పేమెంట్ ఆర్డర్ బుక్ పోయినది

■ I, N. PULLAMMA W/o A. JAYARAM R/oF.15/201, సాయికుటీర్ రోడ్డు, Near వాగ్దేవి స్కూల్ దగ్గర, YMRకాలనీ, ప్రొద్దుటూరు. కడప జిల్లా Pensioner ID No: 80380998, Family Pension PPONO:14-003586-FP, పేమెంట్ ఆర్డర్ పేపర్ ఇంటి నుండి T.B రోడ్డు లోని మార్కెట్ యార్డ్ పోతుండగా దారిలో పోయినది. దొరికిన వారు తెలుపగలరు. సంప్ర॥9704100670. [C-781442]

ASTROLOGY

■ శ్రీ బాలాజీ అనుగ్రహ జ్యోతిష్య పీఠం పండిట్: శ్రీ బాలాజీ అనుగ్రహ ఆరదనతో విద్య, ఉద్యోగం, భార్యా భర్తల గొడవలు, కోర్టు కేసులు, వ్యాపారం, సంతానం, సమస్యలు ఎలాంటి సమస్యలు ఉన్న ఫోన్ ద్వారా పరిష్కారం. Ph: 9902893454 [H-793586]

WANTED

■ దియాన్ స్లిమ్మింగ్ క్లినిక్ నందు పనిచేయుటకు లేడి స్టాఫ్ కావలెను. లేడి రిసెప్షనిస్ట్ మరియు ఫిజియోథెరఫిస్టు కావలెను. Q: ఇంటర్ / డిగ్రీ/ BPT. సంప్ర: 8686018602. [C-781438]

■ ప్రముఖ బ్యాటరీ కంపెనీ నందు పని చేయుటకు అకౌంటెంట్(లేడీస్) మరియు డ్రైవర్ (లైసెన్స్ ఉండాలి) కావలెను. సంప్ర॥9985955063, 7981121926. [C-781458]

■ కడపలోని హోటల్ నందు పని చేయుటకు వెజ్ & నాన్ వెజ్ బాగా చేయగల, అనుభవం గల వంట మాస్టర్, లేడి సూపర్‌వైజర్స్ మరియు పనిమనిషి కావలెను. సం॥7981952392. [C-781428]

■ ప్రాఫిట్ షూ కంపెనీ, కడప, ప్రొద్దుటూరు మరియు పులివెందుల స్టోర్స్ నందు పనిచేయుటకు రిటైల్ షోరూంలో అనుభవం కల్గిన సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ 8143867676. [C-781462]

■ G.K.S.Plywood & hardware Shoow room నందు పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.లోకల్ వాటికి ప్రాధాన్యత. ప్రొద్దుటూరు.సంప్ర:8885225664, 9989434587. [C-781441]

■ ఉద్యోగాలు: S.R. నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 28 నో ఫీజ్, Cell: 9177342337. [WA-6917]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190596]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd. Ph: 7995374999 [HA-1086]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 16K-18K విజయవాడ. Ph: 9640528899/ 9640648899 [H-1088]

■ సెక్యూరిటిగార్డ్స్ సూపర్‌వైజర్స్ హైదరాబాద్‌లో పని చేయుటకు కావలెను. జీతం: 13,000 -15,000/- రూం+భోజనం ఫ్రీ. Ph: 7569329230, 9848229947 [HA-10373]

■ నెల్లూరు ప్రముఖ ఆయిల్ కంపెనీలో పని చేయుటకు సెక్యూరిటి గార్డ్సు కావలెను. 12గం॥ల డ్యూటీ, జీతం: 15000/-. ఫ్రీ రూం PF, ESI కలదు. కలదు. సంప్ర: 99594 44086. [NA-21841]

■ మదనపల్లి: క్లినిక్ నందు పనిచేయుటకు Inter, Degree చదివిన లేడీ రిసెప్షనిస్ట్/ స్పీచ్ థెరపిస్ట్ కావలెను. S:5000 to 10,000, Timings: 9 to 2 P.M & 4.30 to 8.00 P.M, 9000225007. [T-1173300]

■ కొత్తగా ప్రారంభించిన మా కంపెనీ నందు 39 మంది స్త్రీ/పుల ఉద్యోగాలు కలవు. జీ: 14000 + DA 6000 + ఫ్రీ రూమ్+ఫుడ్. అర్హత 7th to డిగ్రీ, సంప్ర॥ మోచంపేట, Opp: రామకృష్ణ స్కూల్, కడప. 9502400350. [A-7649]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 7815811791 [G-795221]

■ రిలయన్స్ సంస్థ నందు పని చేయుటకు I.T.I. ఎలక్ట్రీషియన్ కావలెను. కడప, రాజంపేట, బద్వేల్ & ప్రొద్దుటూరులో కావలెను. Sal.+ PF + ESI ✆ 96666 35187 [B-966]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు: 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422. [H-796757]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010224479
9010223797
9705898007